జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 5-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 635 పేజీలు: 4 వెల : రూ.7




# మంట పుట్టిస్తున్న.. డొమెస్టిక్ దందా!

* ఏటా రూ.5.4 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం * ప్రభుత్వ ఖజానాకు భారీ గండి! * శ్రీకాకుళం జిల్లాలో జోరుగా వంటగ్యాస్ మళ్లింపు
* కమర్షియల్ సిలిండర్లకు బదులు గృహ వినియోగ గ్యాస్ వాడకం
* 'మామూళ్ల' మత్తులో కొందరు పౌరసరఫరాల శాఖ అధికారులు

శ్రీకాకుళం, ఏప్రిల్ 4 (వార్త): జిల్లాలో వంటగ్యాస్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. గృహ వినియోగం కోసం రాయితీపై ఇచ్చే సిలిండర్లు దారి మళ్లి హోటళ్లు, రెస్టారెంట్ల పొయ్యిల్లో మండుతున్నాయి. చట్ట ప్రకారం వాణిజ్య అవసరాలకు కమర్షియల్ సిలిండర్లే వాడాలన్న నిబంధన ఉన్నా, కొందరు హోటల్ యజమానులు కేవలం లాభాపేక్షతో నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఆయిల్ కంపెనీల లెక్కల ప్రకారం నెలకు 10,000 కమర్షియల్ సిలిండర్లు అమ్ముడుపోవాల్సి ఉండగా, కేవలం 4,000 మాత్రమే సేల్ అవుతుండటం ఈ అక్రమ దందాను స్పష్టం చేస్తోంది.

## నెలకు రూ.45 లక్షలు.. ఏటా రూ.5 కోట్లు స్వాహా!

జిల్లాలో ప్రతి నెలా దాదాపు 6,000 కమర్షియల్ సిలిండర్ల (19 కిలోలు) వినియోగం తగ్గడానికి ప్రధాన కారణం డొమెస్టిక్ సిలిండర్ల వాడకమే. 6,000 కమర్షియల్ సిలిండర్లకు సమానమైన 8,000 డొమెస్టిక్ సిలిండర్లు (14.2 కిలోలు) దారి మళ్లుతున్నాయి. గృహ వినియోగ గ్యాస్ కిలో ధర సుమారు రూ.64 కాగా, కమర్షియల్ గ్యాస్ ధర రూ.105 పలుకుతోంది. అంటే ప్రతి కిలోపై రూ.41 మేర తేడా ఉంది. ఈ లెక్కన నెలకు సుమారు 1,14,000 కిలోల గ్యాస్ దుర్వినియోగం అవుతోంది. దీనివల్ల నెలకు రూ.45.6 లక్షలు, ఏడాదికి సుమారు రూ.5.4 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది.

## ఏజెంట్ల నెట్‌వర్క్.. గ్రామాల నుంచే సేకరణ

హోటల్ యజమానులు నేరుగా కాకుండా ఏజెంట్ల ద్వారా ఈ దందాను నడిపిస్తున్నారు. ఏడాదికి 12 సిలిండర్ల కోటా ఉన్నప్పటికీ, సగటున 6 సిలిండర్లు మాత్రమే వాడే సామాన్యులను ఈ ఏజెంట్లు టార్గెట్ చేస్తున్నారు. గ్రామాల్లోని సామాన్య వినియోగదారులకు రూ.100 ఆశ చూపి బుకింగ్ చేయిస్తారు. ఆ గ్యాస్ సిలిండర్‌ను సేకరించిన ఏజెంట్‌కు మరో రూ.100 కమీషన్ అందుతుంది. ఇవన్నీ హోటళ్లకు చేరతాయి. కమర్షియల్ సిలిండర్ వాడితే అయ్యే ఖర్చు కంటే, ఇలా అక్రమంగా వాడటం వల్ల హోటల్ యజమానులకు ఒక్కో సిలిండర్‌పై రూ.700 వరకు లాభం (దాదాపు 40 శాతం ఆదా) మిగులుతోంది.

## అధికారుల అండదండలు.. డెలివరీ బాయ్స్ బలి

ఈ భారీ కుంభకోణం పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాల్సిన అధికారులు హోటల్ యజమానుల నుంచి 'నెలవారీ మామూళ్ల' మత్తులో ఉండటంతో దాడులు, కేసులు అన్న ఊసే లేకుండా పోయింది. మరోవైపు ఈ వ్యవస్థలో గ్యాస్ డెలివరీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిస్ట్రిబ్యూటర్లు ఇచ్చే సేల్స్ టార్గెట్లు పూర్తి చేయలేక, మరోవైపు అక్రమాలకు సహకరించలేక డెలివరీ బాయ్స్ ఉద్యోగ ముప్పును ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, సామాన్యుల రాయితీని అక్రమార్కుల పాలు చేస్తున్న ఈ నెట్‌వర్క్‌పై ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(డొమెస్టిక్ దందాలో ఏయే హోటళ్లు ముందంజలో ఉన్నాయి.. వారికి సహకరిస్తున్న కూటమి పార్టీ మహిళా నేత భర్త ఎవరు? తదితర అంశాలపై మరో సంచికలో కలుద్దాం)

# విద్యార్థుల భద్రతలో.. ఇంత నిర్లక్ష్యమా?



* ఇకపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* పాతపట్నం గురుకుల పాఠశాల తనిఖీ
* ప్రిన్సిపాల్ పద్మావతి, జేఈ రామారావుపై ఆగ్రహం

పాతపట్నం, ఏప్రిల్ 4 (వార్త): విద్యార్థుల భద్రతలో ఇంత నిర్లక్ష్యం పనికిరాదని, ఇకపై వసతుల కల్పనలో ఏమాత్రం అలసత్వం వహించినా సహించేది లేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. శనివారం పాతపట్నం మండలంలో పర్యటించిన ఆయన, ఇటీవల ఏడవ తరగతి విద్యార్థిని పూజిత మెట్లపై నుండి జారిపడి మృతి చెందిన సంఘటన నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు గంటసేపు పాఠశాల ప్రాంగణంలో పర్యటించిన కలెక్టర్, ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని, మెట్లను, టెర్రస్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థిని ఎక్కడ పడిపోయింది? ఎలా పడిపోయింది? అన్న విషయాలపై సిబ్బందిని ప్రశ్నించి వివరాలు ఆరా తీశారు. విద్యార్థులపై సరైన నిఘా లేకపోవడం వల్లే ఇటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నాయని పేర్కొంటూ ప్రిన్సిపాల్ పద్మావతిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రమాదాలు జరగకుండా మెట్ల వద్ద మెష్ లేదా ప్రత్యామ్నాయ రక్షణ ఏర్పాట్లు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్లకు తలుపులు, ప్రహరీ వంటి పనులకు నిధులు మంజూరు చేసినప్పటికీ, పనులు ప్రారంభించకపోవడంపై ప్రిన్సిపాల్‌తో పాటు ఈడబ్ల్యుఐడిసి జేఈ రామారావుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి, వారికి అందుతున్న విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాతపట్నంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు. అక్కడ శుద్ధజల యంత్రం పనిచేయకపోవడాన్ని గమనించి, విద్యార్థులకు తాగునీటి ఇబ్బంది కలగకుండా వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణ సమయంలో వెలువడే ధూళి వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బాధ్యులపై క్రిమినల్ చర్యలు

* పాత పాల నిల్వలను విక్రయిస్తే సహించేది లేదు
* పాల అనుబంధ ఉత్పత్తులను 'కోల్డ్ చైన్' నిర్వహించాలి
* జిల్లా ఆహార భద్రతాధికారి కె.లక్ష్మి
* బాదం పాలు తయారీ కేంద్రాలపై మెరుపుదాడులు
* బాదం పాలు, కస్టర్డ్ పౌడర్ నమూనాల సేకరించిన ఆహార భద్రతాధికారి * ల్యాబ్‌కు పంపించిన శాంపిల్స్

శ్రీకాకుళం, ఏప్రిల్ 4 (వార్త): శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం ఉత్సవాల్లో కలుషిత బాదం పాలు తాగి భక్తులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై జిల్లా ఆహార భద్రతా విభాగం విచారణ చేపట్టింది. జిల్లా ఆహార భద్రతాధికారి కె.లక్ష్మి శనివారం శ్రీకాకుళం నగరంలోని బాదం పాలు తయారీ కేంద్రాలు, విక్రయించే మొబైల్ ఫుడ్ కోర్డులు, ముడి సరుకు సరఫరా చేసే కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తయారీలో ఉపయోగిస్తున్న ముడి సరుకుల నాణ్యతను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీల్లో భాగంగా అనుమానిత బాదం పాలు కస్టర్డ్ పౌడర్ నమూనాలను అధికారి సేకరించారు. మొత్తం మూడు ఎన్‌ఫోర్స్‌మెంట్ శాంపిల్స్‌ను నాణ్యత విశ్లేషణ కోసం ల్యాబ్ ఏజెంట్లకు అందజేయగా, మరో మూడు సర్వైలెన్స్ శాంపిల్స్‌ను విశాఖపట్నంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆహార ప్రయోగశాలకు పంపించినట్లు లక్ష్మి వెల్లడించారు. ఈ నివేదికల ఆధారంగా బాధ్యులైన విక్రేతలపై ఆహార భద్రత ప్రమాణాల చట్టం ప్రకారం కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఇప్పటికే ఈ ఘటనకు కారణమైన విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వేసవి నేపథ్యంలో పాలు, పాల అనుబంధ ఉత్పత్తులను విక్రయించే వారు తప్పనిసరిగా 'కోల్డ్ చైన్' నిర్వహించాలని, పాత నిల్వలను విక్రయిస్తే సహించేది లేదని విక్రేతలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు కూడా బయట పానీయాలు కొనే ముందు తయారీ తేదీని గమనించాలని, రుచి లేదా వాసనలో తేడా ఉంటే వాటిని తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, జిల్లా యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతుందని ఈ సందర్భంగా ఆహార భద్రతాధికారి స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము, టూటౌన్ ఎస్ఐ హరికృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# చలివేంద్రాలను ఉపయోగించుకోవాలి

**పలాస, ఏప్రిల్ 4 (వార్త):** ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు విడివిడిగా చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. అక్కుపల్లి జంక్షన్, కాశీబుగ్గ బస్టాండ్, నెహ్రూ పార్క్ సెంటర్ల వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థమే ఈ ఏర్పాటు చేశామన్నారు. తీవ్రమైన ఎండలతో బాట సారులు, సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ఆమె తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా ముందుకు వచ్చి ప్రజలకు సేవలందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



**పోలాకి, ఏప్రిల్ 4(వార్త):** ప్రతి విద్యార్థి భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని పోలాకి ఎస్ఐ రంజిత్ కుమార్ అన్నారు. శనివారం ఆయన పోలాకి మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి "యూరేఖా సైన్స్ ఎక్స్‌పో" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ ఆఫీసర్ కుమారస్వామి ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ శాస్త్రీయ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా క్లౌడ్ సాంకేతికత ఆధారంగా తయారు చేసిన ప్రాజెక్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకొని శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిమడాంలో తీవ్రమైన తాగునీటి సమస్య



**జలుమూరు, ఏప్రిల్ 4 (వార్త):** తిమడాం గ్రామంలో తాగునీటి సమ స్యలు తీవ్రంగా మారాయి. వారం రోజు లుగా కొళాయిల ద్వారా మంచినీటి సర ఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విష యమై అధికారులకు పలుమార్లు ఫిర్యా దులు చేసినప్పటికీ స్పందన లభించ లేదని ఎంపీటీసీ సభ్యుడు అసిరినా యుడు తెలిపారు. వేసవి తీవ్రత పెరుగు తున్న నేపథ్యంలో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండుతున్న ఎండల దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

## ప్రమాదకరంగా వంశధార కాలువ వంతెన



**సారవకోట, ఏప్రిల్ 4(వార్త):** అక్కివలస గ్రామానికి సమీపంలో వంశధార కాలువపై ఉన్న పాత వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా ఉన్న రైలింగ్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆ వంతెనకు సమీపంలో కొత్త వంతెన నిర్మించినప్పటికీ, కొంతమంది ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనదారులు పాత వంతెనపైనే ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదాలను నివారించేందుకు పాత వంతెనను పూర్తిగా బ్లాక్ చేసి రాకపోకలను నిలిపివేయాలని పలువురు కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అరుణోదయ రాష్ట్ర శిక్షణా శిబిరం, జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

**పలాస, ఏప్రిల్ 4 (వార్త):** మనువాద కార్పొరేట్ ఫాసిజం, విప్లవ సాంస్కృతిక ఉద్యమ కర్తవ్యం అన్న అంశంపై ఒంగోలులో ఈ నెల 19న రాష్ట్ర సదస్సు జరుగుతుందని, 16, 17, 18వ తేదీల్లో అక్కడే కళాకారులకు అరుణోదయ రాష్ట్ర శిక్షణ శిబిరం, రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని వీటిని విజయవంతం చేయాలని అరుణోదయ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ అధ్యక్షుడు స్వర రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సోమేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన లొత్తూరులో ప్రచారం నిర్వహించారు. విప్లవ సాంస్కృతిక ఉద్యమ కర్తవ్యాలను, హిందూ మతం, మద బ్రాహ్మణీయ ఫాసిజం ప్రమాదాన్ని తెలియజేసే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడిదారీ విధానం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని, ఆర్థిక సంక్షోభం నిరుద్యోగం అసమానతలు పెరుగుతున్నాయని, ఈ సంక్షోభం నుంచి బయట పడేందుకు సామ్రాజ్యవాద శక్తులు యుద్ధాలను రెచ్చగొడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆదిత్య నిలబెట్టుకోవడానికి అమెరికా ఇజ్రాయిల్ కూటమి మధ్య ప్రాత్య దేశాలపై దాడులు చేస్తుందని, మోదీ సర్కార్ ట్రంప్ తొత్తు అని, దేశ ప్రయోజనాల్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. అరుణోదయ సంస్కృతి సమైక్య.. దోపిడీ వ్యవస్థలో మార్పు కోసం నూతన ప్రజాతంత్ర వ్యవస్థ కోసం పోరాడుతుందని చెప్పారు. ఈ జనరల్ కౌన్సిల్ సెక్షన్‌ను జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సవర భాస్కరరావు, కోదండరాం, వంకల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.




# సౌత్‌కోస్ట్ రైల్వేలో ఇచ్ఛాపురం విలీనంపై హర్షం



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4(వార్త):** రాష్ట్రంలోని నాలుగు ప్రధాన రైల్వే డివిజన్లను ఒకచోట కలుపుతూ విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌పై జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్, సంఘసేవకురాలు డాక్టర్ సిపాన గుణవతి హర్షం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు కుర్దా రోడ్డు డివిజన్‌లో ఉన్న ఇచ్ఛాపురంతో సహా మరో ఆరు రైల్వే స్టేషన్లు విశాఖపట్నం డివిజన్‌లో విలీనమవటం ఈ ప్రాంత అభివృద్ధికి పెద్ద ఎత్తున ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ఈ దిశగా కృషి చేసిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కి సంఘ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ప్రయోజనాల కొరకు పని చేసే నాయకులను పార్టీలకతీతంగా స్వాగతిస్తామని వారు స్పష్టం చేశారు. ఇచ్ఛాపురం, జాడుపూడి, సోంపేట, బారువా, మందస, సుమ్మాదేవి, పలాస వంటి స్టేషన్లలో కీలక సమస్యలను పరిష్కరించాలని కోరారు. జాడుపుడి, బారువా, సుమ్మాదేవి స్టేషన్లలో అన్ని పాసింజర్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని కోరారు. కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా ఈ స్టేషన్లలో ఆగేటట్లు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సోంపేట రైల్వే స్టేషన్‌లో మరుగుదొడ్లు, వెయిటింగ్ హాల్ వంటి ప్రాథమిక సదుపాయాలు పూర్తి స్థాయిలో పున రుద్ధరించాలని కోరారు. వందే భారత్, యశ్వంతపూర్–అహ్మదాబాద్ వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపివేయాలన్న ప్రజల విజ్ఞప్తిని అధికారులు పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరమన్నారు. అధికారులు ప్రతి రైలును రెండో ప్లాట్‌ఫాంకు మళ్లించడంతో వృద్ధులు, వికలాంగులు ఓవర్‌బ్రిడ్జి పైకి ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఒక ప్రయాణికుడు ఒకటో ప్లాట్‌ఫారమ్‌లో నిలిచిన గూడ్స్ రైలు కిందుగా వెళ్లే ప్రయత్నంలో రైలు కదలడంతో జరిగిన దుర్ఘటనలో మరణించడం అత్యంత విచారకరమన్నారు. ఇది పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమేనని సంఘం ఆరోపించింది. సోంపేట రైల్వే స్టేషన్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైల్వే జోన్ అధికారులను డిమాండ్ చేశారు. స్టేషన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైళ్ల నిలుపుదల, ప్రయాణికులకు అవసరమైన సేవల సమస్యలపై సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్‌కు లేఖ పంపినట్టు డాక్టర్ గుణవతి తెలిపారు. ఈ సమావేశానికి శ్రీకాకుళం జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారుడు లొకినింది గోవిందరాజులు, ఇచ్ఛాపురం మండల అధ్యక్షులు సాలిన ఢిల్లీ రావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశం లో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.గుణప్రసాద్, ఉపాధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి విశ్వ ప్రభాకరరావు, మురళి, సోంపేట, కంచిలి మండల కన్వీనర్లు ఖడియం ప్రసాదరావు, ధనంజయ్, ఇచ్ఛాపురం మహిళా కన్వీనర్ సాలిన పద్మ, పలాస సబ్ డివిజనల్ కార్యదర్శి లొట్ల కృష్ణమూర్తి, సోషల్ మీడియా కన్వీనర్ పిట్టా పోలయ్య, సబ్ డివిజనల్ లీగల్ అడ్వైజర్ ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతో ఎన్నికలకు సమాయత్తం : వీసీ



**మందస, ఏప్రిల్ 4(వార్త):** ఐకమత్యంతోనే రానున్న ఎన్నికలకు సమాయత్త మవుదామని తెలుగుదేశం పార్టీ పలాస నియోజకవర్గం సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి(వీసీ) అన్నారు. మందస మండలంలోని మందస, తాళ్ల గురంటి, బుడారసింగి, సిరిపురం, పొత్తంగి, భోగాపురం పంచాయతీల్లో శనివారం ఆయన పర్యటించి ఆయా పంచాయతీల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా వెంకన్నచౌదరి ఆయా పంచాయతీల సమస్యలపై ఆయా గ్రామ, అధ్యక్ష కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల సాధనకు భరోసా కల్పించారు. అక్కడకు వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, ఆయా అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, కార్యదర్శి సాలిన మాధవరావు, క్లస్టర్ ఇన్‌చార్జి కొర్ల కన్నారావు, లబ్బ రుద్రయ్య, నవీన్ యాదవ్, వెంకటరావు, ఈశ్వరరావు, డొంకురు తిరుపతి, రాజాన మహేష్, రట్టి లింగరాజు, బేసి ఈశ్వరావు, దేబాసిస్ పండా, బత్తిన తారక్, అడ్డి ఈశ్వరరావు, ఆయా పంచాయతీల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆదివాసీ ముద్దుబిడ్డ సవర సోమలయ్యకు సన్మానం



**మందస, ఏప్రిల్ 4(వార్త):** ఆదివాసీ ముద్దుబిడ్డ సవర సోమలయ్య అని పలువురు గిరిజన నాయకులు అన్నారు. కిల్లోయికాలనీకి చెందిన ఉపాధ్యా యుడు సోములయ్య సాహితీ రంగంలో ఎనలేని సేవలు అందిస్తుండడంతో ఆయనను ఆదివాసీ సమాజం సమక్షంలో గిరిజనులు సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సోములయ్య ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పని చేస్తున్నారు. ఆదివాసీ వికాస పరిషత్ సంఘంలో ఆది నుంచి నేటి వరకు కీలక నేతగా ఉంటూ అనేక సూచనలు, సలహాలు ఇస్తూ సంఘం పురోభివృద్ధిలో ఆయన పాత్ర అమోఘమన్నారు. సోములయ్య ఆదివాసీ బిడ్డగా సాహితీ శిరోమణి, సాహితీ సింహం బిరుదులు పొందడం గిరిజనజాతికి గర్వకారణమన్నారు. సాహితీ అభిమానులు, సోమలయ్య అభిమానులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, బంధువులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, వివిధ హోదాలో ఉండే సంఘ సభ్యులు పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం సన్మాన గ్రహీత సోమలయ్య మాట్లాడుతూ తనకీ సన్మానం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ వికాస్ పరిషత్ అధ్యక్షుడు ఎస్.జగన్, గౌరవ అధ్యక్షుడు గణేశ్వరరావు, దండాసి, రామారావు, విజయ్, ఉపాధ్యక్షుడు డొంబురు, జయరాం, కిరణ్, చిత్రసేను, రామమోహన్, నారాయణ, ఆనందరావు, రాజారావు, సూర్యారావు, ఉమాబిస్వాల్, ప్రసాద్ కుమార్ డోలాయి, ఢిల్లీ, లోకనాథ్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ చైర్మన్‌ను తొలగించాలి

**నరసన్నపేట, ఏప్రిల్ 4(వార్త):** తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడుపై పలు ఆరోపణల నేపథ్యంలో ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. శనివారం నరసన్నపేటలోని పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన ఆయన, అనంతరం పార్టీ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తిరుమల పవిత్రతను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. అభ్యంతరాలు ఉన్న వ్యక్తులు కీలక పదవుల్లో కొనసాగడం సరైంది కాదని, వెంటనే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ధర్మాన కృష్ణచైతన్య, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## నేరేడు బ్యారేజీ సమస్య పరిష్కారం హర్షణీయం

### -ఏపీ బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి తాతారావుయాదవ్



**మందస, ఏప్రిల్ 4(వార్త):** అర్ధ శతాబ్దం నుంచి ఏపీ–ఒడిశాల మధ్య అంతర్రాష్ట్ర సమస్యగా అపరిష్కృతంగా నలుగుతున్న జిల్లావాసుల కల వంశధార నది మీద భామిని మండలంలో నిర్మించతలపెట్టిన నేరడీ బ్యారేజీ సమస్య పరి ష్కారడ కావడం హర్షణీయమని ఏపీ బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి తాతారావుయాదవ్ అన్నారు. హరిపురంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవతో సమస్య పరిష్కారం కావడంతో జిల్లా ప్రజలకు ఆనందదాయకంగా ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ట్రిబ్యునల్, ఎమ్మెల్యే గౌతు శిరీషకు జిల్లా రైతాంగం తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలల సాకారం నదుల అనుసంధానంలో భాగంగా 2019 ఫిబ్రవరి 18న వంశధార బాహుదా నది అనుసంధానానికి రూ.6,432 కోట్లతో జలవనరుల శాఖకు ప్రతిపాదనలు పంపించారని, కానీ వైఎస్సార్సీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేయడంతో ఆగిపోయిందన్నారు. ప్రజారంజక పాలన అందిస్తూ ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అమరావతిని రాజధానిగా రూప కల్పన చేస్తూ ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం సారథ్యంలో వంశధార, బాహుదా నదుల అనుసంధానం చేస్తూ.. వంశధార నీటిని ఇచ్ఛా పురం వరకు అందించే బృహత్తర కార్యక్రమంతో పలాస, ఇచ్ఛాపురం రైతులకు ఉద్దానం ప్రజలకు సాగునీరు, తాగునీరు సౌకర్యం కలుగుతుందని భావిస్తున్నా మన్నారు. చంద్రబాబు నాయకత్వంలో సాకారం కాగలదని కోరుకుంటున్నా మని చెప్పారు.

## బ్రహ్మాస్త్రంతో తెగుళ్ల నివారణ



**సోంపేట, ఏప్రిల్ 4(వార్త):** సేంద్రీయ విధానంలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలకు తెగుళ్ల భారీ నుంచి కాపాడేందుకు బ్రహ్మాస్త్రం అనే కషాయాన్ని వాడడం మంచి ఫలితాన్ని ఇస్తుందని ప్రకృతి వ్యవసాయ బూరగాం యూనిట్ ఇన్‌చార్జి సీర కామరాజు పేర్కొన్నారు. బూరగాంలో రైతు మద్దు వెంకటరావు సాగు చేస్తున్న కూరగాయల పంటలకు కాయతొలుచు పురుగు, కాండం తొలిచు పురుగు ఆశించి నష్టపరుస్తున్న నేపథ్యంలో శనివారం రైతు పొలంలో జామ జిల్లేడు వేప ఆముదం ఆకుల మిశ్రమంతో బ్రహ్మాస్త్రం అనే కషాయాన్ని తయారు చేశారు. దీన్ని కొద్ది రోజులు నిల్వ ఉంచిన తర్వాత పిచి కారీ చేయడంతో పంటకు మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ ప్రమీల పాల్గొన్నారు.

## మడపాంలో రైస్ మిల్ సీజ్.. 14 టన్నుల ధాన్యం స్వాధీనం

**నరసన్నపేట, ఏప్రిల్ 4(వార్త):** మడపాంలోని వేంకటేశ్వర మోడరన్ రైస్ మిల్లును సీజ్ చేసినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సూర్యప్రకాష్ శనివారం తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా మిల్లును పరిశీలించగా, ఎఫ్‌సీఐకి పంపించాల్సిన 14 టన్నుల ధాన్యాన్ని నిల్వ ఉంచినట్లు గుర్తించామన్నారు. నిబంధనల ఉల్లంఘనకు గాను మిల్లును సీజ్ చేశామన్నారు. అదనంగా మూడు బస్తాల పీడీఎస్ బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై తదుపరి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అనారోగ్య బాధితులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**కంచిలి, ఏప్రిల్ 4 (వార్త):** కంచిలి మండలానికి చెందిన పలువురు అనారోగ్య బాధితులకు ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసినట్లు శ్రీరాంపురం గ్రామానికి చెందిన టీడీపీ యువ నేత మాదిన ప్రదీప్ తెలిపారు. 9 మంది బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3,23,614లు పంపిణీ చేశారు. శాసనం గ్రామానికి చెందిన గోరకల జస్వంత్, ఆముదాల పుట్టుకకు చెందిన కుమారి సాహు, కత్తివరంనకు చెందిన గున్న జాన్విక, కోరాడ నవ్య, జాయి శాంతమూర్తి, మకరాంపురంనకు చెందిన ఎర్ర భీమారావు, రాగుపురంన కు చెందిన బదకల గంగయ్య, కొక్కిలి పుట్టుకకు చెందిన నిరంజన్ బి సాయి, గొల్ల పుట్టుగకు చెందిన బంగారు హైమావతి వీరిలో ఉన్నారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే అశోక్‌కు పలువురు టీడీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రతి రూపాయి సద్వినియోగం చేసుకోవాలి

### -ఎమ్మెల్యే గౌతు శిరీష

### -పలాసలో “బడ్జెట్ 2026-27 అవుట్‌రీచ్”

**పలాస, ఏప్రిల్ 4 (వార్త):** బడ్జెట్లో చూపించిన విధంగా ప్రతి ఒక్క రూపాయి సద్వినియోగం చేసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారులను ఆదేశించారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన “బడ్జెట్ 2026-27 అవుట్‌రీచ్” కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడ్జెట్‌లో కేటాయించే ప్రతి రూపాయిని ఎక్కడ, ఎలా ఖర్చు చేయాలనే దానిపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఆగిపోయిన సుమారు 85 కేంద్ర పథకాలను తిరిగి ప్రారంభించామని, నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఢిల్లీలో ఒక ఐఏఎస్ అధికారి, నలుగురు నిపుణులతో ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామని, వీరు కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి రూపాయిని వదలకుండా ఫాలో-అప్ చేస్తారన్నారు. పారదర్శకతను పెంచడం ద్వారా బడ్జెట్‌ను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు, అభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, సంక్షేమ కార్యక్రమాలపై పూర్తి అవగాహనను జిల్లా స్థాయి, మండల స్థాయి ప్రభుత్వ అధికారులకు, ప్రజలకు చేరవేయడమే ఈ అవుట్‌రీచ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ ఆశయాలు ప్రతి ఇంటికి చేరేలా, అమలు ప్రక్రియను వేగవంతం చేసే దిశగా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో



నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ వినాయకరామ్, పలాస, వజ్రపు కొత్తూరు, మందస ఎంపీడీవోలు వసంత్ కుమార్, రమేష్ నాయుడు, అప్పారావు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, అన్ని శాఖల అధికారులు, సీపీఏపీ యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో ‘అమ్మకు వందనం‘



**పలాస, ఏప్రిల్ 4 (వార్త):** శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణాపురంలో శనివారం అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి సేవా సేవా సంస్థలు శ్రీకాకుళం జిల్లా వేదం ఇన్‌చార్జి జేవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం సాగింది. ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ మానవతా విలువలతో కూడిన ఆధ్యాత్మిక, లౌకిక విద్యనందించడమే ఈ స్కూల్ ప్రధానోద్దేశ్యమని తెలిపారు. పిల్లలను అన్ని రంగాల్లో సమర్థవంతంగా తీర్చిదిద్దడమే తమ సిబ్బంది ప్రధాన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ తాలాసు శ్రీనివాస్, జామి శ్రీను, కన్వీనర్ ఇప్పిలి తిరుమల, దోకి జగదీష్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి తదితరులు పాల్గొన్నారు.


## గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసిన కలెక్టర్



**సారవకోట, ఏప్రిల్ 4 (వార్త):** సారవకోటలోని గ్యాస్ ఏజెన్సీని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా అందిస్తున్న డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ కనెక్షన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు తక్కువగా ఉన్నాయని ఏజెన్సీ సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన, సంబంధిత అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా టెక్కలి వాసి సాయిసృజన ఎంపిక

**టెక్కలి, ఏప్రిల్ 4 (వార్త):** టెక్కలి సైనిక్‌నగర్‌కు చెందిన మార్పు సాయి సృజన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. గురువారం విడుదలైన ఫలి తాల్లో ఆమె ఈ విజయాన్ని సాధించారు. టెక్కలిలో ప్రాథమిక, ఉన్నత విద్యను పూర్తిచేసిన సాయి సృజన, విజయవాడలో ఇంటర్ చదివారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, ఢిల్లీ యూనివర్సిటీలో బీఎల్ పట్టా పొందారు. ఆమె తండ్రి నారాయణమూర్తి ఆంగ్ల ఉపాధ్యాయుడు కాగా, తల్లి గృహిణి. సాయిసృజనకు పలువురు అభినందనలు తెలిపారు.



## రన్ ఫర్ జీసెస్ విజయవంతం




**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4(వార్త):** ఇచ్ఛాపురంలో దైవజనులు, సంఘ పెద్దలు, సంఘ విశ్వాసులు కలిసి, ఏసుక్రీస్తు ప్రభువు మరణం, పునరుద్ధానము తెలియ జేస్తూ రన్ ఫర్ జీసస్ శనివారం నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి సంతపేట వరకు పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈ రన్ సాగింది. క్రైస్తవ విశ్వాసకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్



**ఇచ్ఛాపురం ఏప్రిల్ 4(వార్త):** ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 సంవత్సరానికి సంబంధించి అకడమిక్ ఆడిట్ శనివారం జరిగింది ఈ ఆడిట్‌ను తొగరాం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.పైడితల్లి, బారువా ప్రిన్సిపాల్ రాంబాబు చేపట్టారు. కళాశాలలో అన్ని వసతులు, విద్యా ప్రమాణాలు, విద్యా ర్థుల ప్రగతి, అన్ని డిపార్ట్‌మెంట్ల రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి, సహాయక చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. నాక్ బీ గ్రేడ్ సాధించిన కళాశాల లో చేరాలని కోరారు.

## మోడల్ స్కూల్‌లో క్రీడా పోటీలు

**ఇచ్ఛాపురం ఏప్రిల్ 4(వార్త):** పురుషోత్తపురం పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్ లో శనివారం సాంస్కృతిక క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈవో కాకర్ల సూర్యారావు ఈ పోటీలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ దుప్పల వైకుంఠరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తిప్పన దుర్యోధన రెడ్డి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.




## అవలంగి పాఠశాలలో శక్తి టీం అవగాహన




**సారవకోట, ఏప్రిల్ 4 (వార్త):** టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో అవలంగిలోని జేబీటీ ప్రైమరీ స్కూల్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.

బాల, బాలికలకు స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. ఏవైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు ఉపయోగించాల్సిన పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లు 112, 181, 1091 వంటి నంబర్లను ఎలా వినియోగించాలో వివరించారు. సైబర్ మోసాలకు 1930, యాంటీ డ్రగ్స్ కోసం 1972, బాలల సమస్యలకు 1098 నంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. నేషనల్ హైవే, గ్రామీణ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, లైసెన్స్ తీసుకోవాలని తెలిపారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు.

నేషనల్ హైవే హెల్ప్‌లైన్ నంబర్ 1033 గూర్చి వివరించారు. వేధింపులు, గృహహింస, పోక్సో కేసులపై కూడా అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో టెక్కలి హెడ్ కానిస్టేబుల్ ఎం.గిరిధర్, కోటబొమ్మాళి హెడ్ కానిస్టేబుల్ కె.గణేష్, పాఠశాల ప్రిన్సిపాల్ జోగి మహంతి మోహన్ గాంధీ, మహిళా కానిస్టేబుల్ ఎం.చామంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శక్తి టీం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.

## టీటీడీ పవిత్రతను కాపాడాలంటే ..

# బీఆర్ నాయుడును తక్షణమే తొలగించాలి



**మందస, ఏప్రిల్ 4(వార్త):** తిరుమల-తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడాలంటే టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును తక్షణమే తొలగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మందసలో వారు శనివారం ర్యాలీ, శ్రీవాసుదేవ పెరుమాళ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నప్పటికీ, ప్రభుత్వంలో చలనం కనిపించడం లేదని ధ్వజమెత్తారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను గౌరవిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని, బీఆర్ నాయుడును టీటీడీ ఛైర్మన్ పదవి నుంచి వెంటనే తొలగించాలన్నారు. సనాతన ధర్మం అని ప్రచారం చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం.. తప్పులు చేసిన బీఆర్ నాయుడుపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి భక్తులకు కూటమి ప్రభుత్వం సమాధానము చెప్పాలన్నారు. దేవాలయం ముందు ప్లకార్డులతో బీఆర్ నాయుడు తక్షణమే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మామిడి

**ఎల్ఎన్ పేట, ఏప్రిల్ 4(వార్త):** రైతు సంక్షేమ కూటమి ప్రభుత్వం లక్ష్యమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. యంబరాం, బొడ్డవలస గ్రామాల్లో రైతులకు శనివారం ఆయన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రాజ ముద్రతో రూపొందించబడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. భూ రికార్డులను సరిచేసి రైతులకు భూ హక్కులు కల్పించడమే ప్రధాన లక్ష్యమ న్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్ గోవింద రావు, పాతపట్నం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు అంపిలి పోలినాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ కె.కృష్ణమాచార్యులు, మాజీ జడ్పీటీసీ వెలమల సుగుణ, టీడీపీ మాజీ మండల అధ్యక్షులు చింతాడ శ్రీనివాసరావు, కుంచాల బాలకృష్ణ, నాయకులు పల్లి చంద్ర రావు, వెలమల రామకృష్ణ, చిన్నారావు, బి.హరీష్, బి.బాలకృష్ణ, ముద్దాడ భోజరాజు, పొన్నాన రామకృష్ణ మాస్టారు, పల్లి శాంతారావు, జమ్మి మోహనరావు, నడిపిల్లి నారాయణరావు, ముగడ భద్రయ్య, బోర గోపాలరావు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## జలుమూరు మండలంలో ప్రత్యేక అధికారుల నియామకం

**జలుమూరు, ఏప్రిల్ 4 (వార్త):** జలుమూరు మండలంలోని పంచాయతీల పాలకవర్గాల గడువు గురువారంతో ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మండలంలోని పలు పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించినట్లు అధికారులు తెలి పారు. ఎంపీడీవో చిన్నమ్మడు మాట్లాడుతూ జలుమూరు, చల్లవానిపేట, శ్రీముఖలింగం పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా తనను నియమించారు. ఆమె శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ పరిపాలన సజావుగా కొనసాగేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



## నరసన్నపేట సర్కిల్‌లో సెక్షన్ 30, 31 అమలు



**నరసన్నపేట, ఏప్రిల్ 4(వార్త):** నరసన్నపేట సర్కిల్ పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ యాక్ట్‌లోని సెక్షన్ 30, 31 అమలులో ఉన్నట్లు సీఐ ఎం.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. టెక్కలి డీఎస్పీ అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నలుగురి కంటే ఎక్కువ మంది గుంపులుగా సమావేశం కావడం నిషేధమని తెలిపారు. ధర్నాలు, నిరసన కార్యక్రమాలు పూర్తిగా నిషేధించబడినట్లు వెల్లడించారు. పోలీస్ ఉత్తర్వులను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## బొంతు పంచాయతీలో డ్రింక్ షాపులపై ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు

**సారవకోట, ఏప్రిల్ 4 (వార్త):** బొంతు పంచాయతీ ప్రధాన రహదారిలో ఉన్న పలు డ్రింక్ షాపులను ఎంపీడీవో శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల జిల్లాలో బాదం పాలతో తయారుచేసిన పానీయాలు సేవించి పలువురు అనారోగ్యం పాలైన ఘటనను గుర్తు చేశారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దుకాణ యజమానులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పాడైన లేదా నాసిరకం పదార్థాలతో పానీయాలు తయారు చేయకూడదని హెచ్చరించారు. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నియమాలు ఉల్లంఘించినట్లయితే సంబంధిత దుకాణాలపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో స్పష్టం చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# సోంపేట మండలం ప్రత్యేకాధికారులు వీరే..!

**సోంపేట, ఏప్రిల్ 4(వార్త):** సోంపేట మండలంలో వివిధ పంచాయతీలకు కొత్తగా నియమించిన ప్రత్యేక అధికారుల వివరాలను మండల పరిషత్ కార్యాలయ వర్గాలు శనివారం అందజేశాయి. సర్పంచుల పదవీకాలం ముగియడంతో పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైన సంగతి తెలిసిందే. కర్తల్లిపాలెం, పాత్రకొండ గ్రామాలకు ఇరిగేషన్ ఏఈ సీహెచ్ సూర్యప్రకాష్, బెంకిలి, జింకిభద్ర, తాళ్లభద్ర గ్రామాలకు మండల ఇంజనీరింగ్ అధికారి కె.రమేష్, పలాసపురం, బీఆర్సీ పురం గ్రామాలకు ఆర్అండ్‌బీ ఏఈ విక్రంను నియమించారు. మాకన్నపురం, తురక శాసనం, కొర్లాం గ్రామాలకు అగ్రికల్చర్ ఆఫీసర్ బి.నరసింహమూర్తి, ఇసుకలపాలెం, రుషికొండకు డిప్యూటీ ఎంపీడీవో ఏ వెంకట్రావు, సుంకిడి, ఎంజీ పురం గ్రామాలకు సీఎస్‌డీటీ పి.కూర్మారావు, మామిడిపల్లి, గొల్లగండి గ్రామాలకు డిప్యూటీ తహసిల్దార్ ఉమామహేశ్వర రావు, బుసభద్ర, పాలవలస, సిరిమామిడి గ్రామాలకు ఎంపీడీవో ఈశ్వ రమ్మ, బారువకు ఎంఎస్‌డవో శాంతకుమారి, సోంపేట ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ అప్పలస్వామి, ఉప్పలం గొల్లవూరు గ్రామాలకు పశువైద్యాధి కారిణి బి.శిరీషను ప్రత్యేక అధికారులుగా నియమించబడ్డారు.

## అపరిచితులు కనిపిస్తే సమాచారమందించాలి

**-కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి**



**పలాస, ఏప్రిల్ 4(వార్త):** అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచా రం అందించాలని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి ప్రజలను కోరారు. శనివారం వారు రామకృష్ణపురంలో గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. నారీ శక్తి , కొత్త చట్టాలపై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలకు సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. పండుగలు, ఉత్సవాలు నిర్వహిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరిగే నేరాలు, 112 కాల్ ఉపయోగం మొదలైన వాటి గురించి అవగాహన కల్పించారు.

## కొత్తూరులో రెస్టారెంట్లపై విజిలెన్స్ దాడులు

**-డొమెస్టిక్ సిల్లిండర్లు స్వాధీనం**

**-కేసులు నమోదు**



**కొత్తూరు, ఏప్రిల్ 4 (వార్త):** కొత్తూరులో నిబంధనలకు విరుద్ధంగా గృహ గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్న హోటళ్లపై విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. కొత్తూరు సెంటర్‌లోని వై.ఎన్.ఆర్ ఫ్యామిలీ మెస్‌లో మూడు, పాలకొండ రోడ్డులోని హరీష్ బిర్యానీ పాయింట్‌లో రెండు సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్.ఐ బి.రామారావు, సివిల్ సప్లైస్ డ్యూటీ ఆఫీసర్ సీహెచ్.భీమారావు నేతృత్వంలో ఈ దాడులు జరిగాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గృహ అవసరాల సిలిండర్లను వ్యాపారాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని, ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## సిద్ధార్థ స్కూల్‌లో ఘనంగా 35వ వీడ్కోలు వేడుకలు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 4(వార్త):** శ్రీకాకుళంలోని సిద్ధార్థ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు 35వ వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మునుకోటి నరసింహమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మంచి నైతిక విలువలతో, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఎదిగి మంచి భవిష్యత్తు పొందాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## కోదండరామాలయానికి ఎంజీఆర్ రూ.50 వేల వితరణ



**ఎల్ఎన్ పేట, మార్చి4(వార్త):** యంబరాంలో నిర్మించిన శ్రీ కోదండరామాలయం ప్రతిష్ఠా మహోత్సవంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం భక్తులతో కలసి ప్రత్యేకపూజలు నిర్వహించి ప్రార్ధనలు చేశారు. కోదండరామాలయం నిర్మాణంనకు రూ.50వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు మన సంస్కృతీ, సంప్రదాయాల ప్రతీకలని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతీ పట్టణ, గ్రామాల్లో నిర్వహించడం సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీ కొత్త మ్యాప్.. వచ్చేసిందోచ్..!




**శ్రీకాకుళం, ఏప్రిల్ 4(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం తీసుకున్న నిర్ణయాలకనుగుణంగా, రాష్ట్ర నూతన మ్యాప్‌ను విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసింది. 28 జిల్లాలతో కూడిన ఈ మ్యాప్‌ను ఈ నెల 2 న ప్రచురించారు. అమరావతిని రాజధానిగా ప్రస్తావించి, కొత్తగా ఏర్పడిన జిల్లాల సరిహద్దులను స్పష్టంగా తెలియజేశారు. ఈ నూతన మ్యాప్ లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలెట్ చేశారు. గుంటూరు, కృ, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలో సరిహద్దుల మధ్యలో అమరావతిని రాష్ట్ర రాజధానిగా చూపుతో మ్యాప్ రూపొందించారు. అయితే అమరావతికి ప్రత్యేకమైన హద్దులను కేటాయించకుండానే ఆ ప్రాంతాన్ని రాజధానిగా గుర్తించడం గమనార్హం. జిల్లాలో సరిహద్దుల మధ్యలో అమరావతిని రాష్ట్ర రాజధానిగా చూపుతూ మ్యాప్ రూపొందించారు. రెండు కొత్త జిల్లాల ఏర్పడిన తర్వాత సరిహద్దుల విషయంలో ఉన్న సందిగ్ధత తొలగించడానికే భౌగోళిక సరిహద్దు నిర్ణయించామని ప్రభుత్వం చెబుతోంది. రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పిన్‌కోడ్ నెంబర్ను ప్రకటిస్తుందని రాష్ట్ర అధికారులు తెలిపారు.

## భూమిపై సర్వ హక్కులు భూ యజమానికే



**'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష**

**-380 మందికి పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ**

**పలాస, ఏప్రిల్ 4 (వార్త):** భూమిపై సర్వ హక్కులు భూ యజమానికే కలిగి ఉంటాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. లొద్దబద్రలో శనివారం నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ఆమె పాల్గొని, మండల పరిధిలోని 380 మంది లబ్దిదారులకు రాజ్యముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారసత్వంగా సంక్రమించిన ఆస్తుల విషయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా, ఎటువంటి రాజకీయ ప్రచారం లేకుండా భూ హక్కుల పత్రాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రీ-సర్వే పేరుతో రెవెన్యూ రికార్డుల్లో గందరగోళం సృష్టించడంతో రైతుల్లో భద్రతాభావం దెబ్బతిందన్నారు. ప్రతి పేజీలో రాజకీయ నాయకుల ఫోటోలు, పార్టీ రంగులతో పాస్ పుస్తకాలు ముద్రించడంతో భూ రికార్డుల విశ్వసనీయతపై అనుమానాలు నెలకొన్నాయని, రైతులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన హామీ మేరకు, రాజముద్రతో కూడిన, పారదర్శక భూ పత్రాలను రైతుల చెంతకు చేర్చుతున్నామని చెప్పారు. రైతుల భూ హక్కులను రక్షించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని, భూ రికార్డులను సక్రమీకరించి రైతులకు నమ్మకమైన పత్రాలు అందజేయడం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆర్.అప్పారావు, తహసీల్దార్ టి.కళ్యాణ్ చక్రవర్తి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, పలాస పీఏసీఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు, లొడగల కామేష్, పలాస టీడీపీ అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్, దువ్వాడ సంతోష్ నాయుడు, ఇతర నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి శాశ్వత రాజధానిగా గుర్తింపుపై హర్షం

**ఇచ్ఛాపురం ఏప్రిల్ 4 (వార్త):** కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుల నరేంద్రనాథ్ పట్నాయక్ అధ్యక్షతన అమరావతి శాశ్వత రాజధానిగా గుర్తింపు పొందినందుకు సంబరాలు జరిపారు. విద్యార్థులను అమరావతి ఆకృతిలో కూర్చోబెట్టి.. ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా గుర్తింపు పొందిందని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మోహన్, మినుచంద్ర, నీలిప్, భాస్కర్, పాపారావు శ్రీనివాస్, దేవకీ రేణుక, జ్యోతి, సుప్రభ, చంద్రవదన, అమిత, రాజ్యలక్ష్మి, భవాని, ధర్మరాజు, ఉప్పాడ పాపారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



## 108లో గర్భిణికి సురక్షిత ప్రసవం

### మానవత్వాన్ని చాటుకున్న సిబ్బంది



**కొత్తూరు, ఏప్రిల్ 4 (వార్త):** సీతంపేట మండలం సిలగం గ్రామానికి చెందిన 36 ఏళ్ల సవర శాంతికి శనివారం ఉదయం పురిటి నొప్పులు రావ డంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సును ఆశ్రయించారు. సమాచారం అందుకున్న కొత్తూరు 108 సిబ్బంది గ్రామానికి చేరుకుని, బాధితురాలిని చికిత్స నిమిత్తం సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు బయలు దేరారు. అయితే ఆసుపత్రికి వెళ్లే మార్గమధ్యలో శాంతికి ప్రసవ వేదన అధికం కావడంతో పరిస్థితి క్లిష్టంగా మారింది. ఆసుపత్రికి చేరుకునేంత సమయం లేకపోవడంతో 108 ఈఎంటీ ఎల్.రాము, పైలట్ డి. గోవిందరావు అప్రమత్తమయ్యారు. ప్రాణాపాయ స్థితి కలగకుండా అంబులెన్సులోనే అత్యవసర వైద్య సేవలందించి ప్రసవం చేశారు. శాంతి సురక్షితంగా నాలుగో కానుపులో బిడ్డకు జన్మనిచ్చింది.

ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స కోసం చేర్పించారు. ప్రస్తుతం వారిద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లిని, శిశువును కాపాడిన 108 సిబ్బందిని స్థానికులు, ఆసుపత్రి సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## బాదం పాలు బాధితులు సురక్షితం

**జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, ఏప్రిల్ 4(వార్త):** శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం గ్రామ జాతరలో బాదం పాలు తాగి పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను, యంత్రాంగం చేపట్టిన చర్యలను కలెక్టర్ వివరించారు. అస్వస్థతకు కారణం: ఏప్రిల్ 1, 2 తేదీల్లో సింగుపురం చినకొండమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా రాజస్థాన్‌కు చెందిన వ్యక్తులు ఒక వాహనంలో బాదం పాలు విక్రయించారు. ఎండ తీవ్రత దృష్ట్యా సుమారు 80 మంది భక్తులు ఈ పాలను సేవించారు. తొలుత గ్లాసు రూ. 40కి విక్రయించి, సాయంత్రానికి ధరను రూ. 10కి తగ్గించడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో వీటిని తాగారు. పాలు వికటించడం వల్ల (ఫుడ్ పాయిజనింగ్) బాధితులకు వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి లక్షణాలు కనిపించాయి. ఇప్పటివరకు అధికారికంగా 29 కేసులు నమోదు కాగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారితో కలిపి మొత్తం బాధితుల సంఖ్య 50 లోపు ఉన్నట్లు గుర్తించాం. బాధితుల్లో ఎక్కువమంది 15 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు వారు ఉన్నారు. అస్వస్థతకు గురైన వారికి సింగుపురం పీహెచ్‌సీతో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నాం. ప్రస్తుతం ఆరుగురు బాధితులు సెలైన్ మీద ఉన్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని, బాధితులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని, వీరందరూ శనివారం రాత్రికే డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో డీఎంహెచ్ఓ, ఆహార భద్రతా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించాం. కలుషిత బాదం పాలు విక్రయించిన ముగ్గురు నిందితులను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. వారి తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి ముడి సరుకులను స్వాధీనం చేసుకున్నాం. ఆహార భద్రతా విభాగం ద్వారా బాదం పాలు, కస్టర్డ్ పౌడర్ నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం విశాఖపట్నం, హైదరాబాద్ ల్యాబ్‌లకు పంపించాం. నివేదికల ఆధారంగా బాధ్యులపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఎక్కడ జాతరలు, ఉత్సవాలు జరిగినా వీధి వ్యాపారులు విక్రయించే ఆహార పదార్థాలు, నీటిని ముందుగా పరీక్షించడం తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చాం. ఆర్డీఓలు, తహసీల్దార్లు ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు బయటి ఆహార పదార్థాలు, పానీయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546